





# నేతన్నలకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం

## పద్మశాలీ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కమర్తపు మురళి

**ఖమ్మం బ్యూరో, కెరటం న్యూస్**

కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలోని నేతన్నలకు అండగా ఉంటూ వారికి భరోసా కల్పిస్తోందని పద్మశాలీ సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు, స్థానిక కార్పొరేటర్ కమర్తపు మురళి అన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో అరిగోస పడిన చేనేత కార్మికులు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఊపిరిపీల్చుకుంటున్నారని అన్నారు. ప్రధానంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచన మేరకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాష్ట్రంలోని నేతన్నలకు రావాల్సిన బతుకమ్మ చీరల బకాయిల నిధుల్లో రూ.50కోట్లు మంజూరు చేసి ఆదుకున్నారని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో సిరిసిల్ల మరమగ్గాల కార్మికులకు, నేతన్నలకు కేసీఆర్ ప్రభుత్వం నాడు బకాయి పడిన రూ.300కోట్లలో ప్రస్తుతానికి రూ.50 కోట్లు మంజూరు చేసి చేనేత కార్మికుల కుటుంబాల్లో ఆనందం నింపారని అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం నాడు బతుకమ్మ పేరుతో నేత కార్మికులకు బకాయిలు పడి పట్టించుకోలేదని విమర్శించారు. కేవలం మాటలకే పరిమితమై చేనేత కార్మికులకు, మరమగ్గాల కార్మికులతో బతుకమ్మ చీరలు తయారు చేయించి వారికి ఇవ్వాల్సిన బకాయిలను పెండింగ్‌లో పెట్టారని గుర్తుచేశారు. ఈ నేపథ్యంలోనే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి నేత కార్మికులకు రావాల్సిన పెండింగ్ బకాయిలను చెల్లిస్తామని భరోసా నింపినట్టుగానే వారికి రూ.50కోట్లు కేటాయించి వారికి ఇచ్చిన హామీని నెరవేర్చు కున్నారని కమర్తపు మురళి అన్నారు. 2020, 21,22,23లలో వరుసగా నాలుగేండ్లు బతుకమ్మ చీరలు నేసి ప్రభుత్వానికి సప్లై చేసిన సిరిసిల్ల కార్మికులను ప్రభుత్వం పట్టించుకోక పోవడం వల్లనే నేత కార్మికులు తీవ్రంగా ఆందోళనకు గురయ్యారనీ, వీరికి కాంగ్రెస్ ప్రభుత్వం అండగా నిలిచి నేత కార్మికులను కాపాడుకుందని అన్నారు. అందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, రాష్ట్ర చేనేత, జౌళిశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు ప్రత్యేకంగా రాష్ట్ర పద్మశాలీ సంఘం తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నానని కమర్తపు మురళి అన్నారు. మిగిలిన బకాయిలు కూడా సాధ్యమైనంత త్వరగా చెల్లించి నేత కార్మికులకు అండగా నిలవాలని మురళి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సీఎం రేవంత్ రెడ్డి కూడా మిగిలిన బకాయిలు త్వరలోనే చెల్లిస్తామని చెప్పడం గొప్ప విషయమన్నారు. దీంతో పాటు చేనేత బీమా, నేతన్నకు భరోసా, త్రిఫ్ట్ స్కీం బకాయిలు తదితర అంశాలపై కూడా కాంగ్రెస్ ప్రభుత్వం దృష్టి సారించాలని పద్మశాలీ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కమర్తపు మురళి అన్నారు. చేనేత కార్మికులకు వెన్నుదన్నుగా ఉంటూ, వారి కుటుంబాలకు ఆసరాగా నిలుస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి యావత్ తెలంగాణ రాష్ట్రంలోని పద్మశాలీ కుటుంబాలు అండగా ఉంటాయని కమర్తపు మురళి స్పష్టం చేశారు.